జగన్ స్వార్థం కోసం దళిత యువకుడు బలి

కోడికత్తి శీను జీవితం నాశనం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి



పెనుకొండ, జనవరి 19 : సీఎం జగన్మోహన్‌రెడ్డి స్వార్థం కోసం, పదవి కోసం కోడికత్తి దాడిని వాడుకుని దళితుడైన పేద యువకుడు శ్రీనివాసులు జీవితాన్ని బలి చేశాడని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి విమర్శించారు. ఆయన ఫోన్ ద్వారా ఆంధ్రజ్యోతితో శుక్రవారం మాట్లాడుతూ.. కోడికత్తి దాడి కేసులో జగన్ కోర్టుకు హాజరు కాకుండా దళితబిడ్డ శీను జీవితాన్ని నాశనం చేస్తున్నాడన్నారు. విశాఖ విమానాశ్రయంలో శ్రీనివాసులు కోడికత్తితో చిన్నగాటు పెడితే ఏకంగా హత్యయత్నం చేశాడంటూ గగ్గోలు పెట్టారన్నారు. గాయాన్ని పరిశీలించిన వైద్యులు చిన్నగాయమనీ, ఎలాంటి విషప్రయోగం లేదని తేల్చారన్నారు. అయినా ఆ గాయానికి తొమ్మిది కుట్లు వేసుకున్నట్లు ప్రచారం చేశాడన్నారు. ఏపీ పోలీసులపై నమ్మకం లేదని హైదరబాద్‌కు వెళ్లి చికిత్స చేయించుకున్నాడన్నారు. కేసును ఎన్‌ఐఏకి బదిలీ చేయాలని కోరారన్నారు. పదవికోసం కోడికత్తి దాడిని వాడుకున్న జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక శ్రీనివాసులును కనీసం పట్టించుకోలేదన్నారు. ఈ కేసులో అతడికి బెయిల్ కూడా రాకుండా కుట్రలు చేస్తున్నాడన్నారు. బాధితుడిగా ఉన్న జగన్‌రెడ్డి డిక్లరేషన్ ఇస్తే శీనుకు బెయిల్ వస్తుందని కోర్టు చెప్పినా, నిందితుడి కుటుంబ సభ్యులు వేడుకున్నా జగన్‌రెడ్డి పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. తాను జగన్‌రెడ్డి అభిమానిననీ, ఆయనకు మైలేజ్ తెచ్చేందుకే దాడి చేసినట్లు అప్పట్లో శీను తెలిపాడు. వాడుకుని వది లేయడంలో జగన్‌రెడ్డి సిద్ధహస్తుడన్నారు. పేదరికం, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు కన్నీటి ఘోష మిగిల్చాడని మండిపడ్డారు. తన స్వార్థ రాజకీయాల కోసం దళితుడిని వాడుకోవడం అత్యంత దారుణమన్నారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చి ఐదేళ్లవుతున్నా కేసు గురించి పట్టించుకోకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. కోడికత్తి కేసులో కుట్రలేదని ఎన్‌ఐఏ కోర్టు తేల్చి చెప్పినా జగన్ మూర్ఖత్వం వదలలేదని దుయ్యబట్టారు.

దళితులపై కేసులు పెట్టి.. అంబేడ్కర్ విగ్రహావిష్కరణా..?

▪ పరిటాల శ్రీరామ్ ధ్వజం



మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం, జనవరి 19: ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పాలనలో దళితులు ఎన్ని కష్టాలు పడ్డారో ఏ గ్రామానికెళ్లినా చెబుతారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం జగన్ ఆవిష్కరించనున్న నేపథ్యంలో పరిటాల శ్రీరామ్ పట్టణంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత జగన్‌కు లేదన్నారు. నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో దళితులపై 6వేలకుపైగా దాడులు జరిగాయన్నారు. 188 మంది దళితులను హత్యచేసిన రక్తచరిత్ర జగన్‌ది అంటూ ధ్వజమెత్తారు. ఇప్పుడు దళితను ఉద్ధరించిన వాడిలా తన ఎస్సీ, ఎస్టీలు అంటూ ఊదరగొడుతున్నారని విమర్శించారు. దళితులకు రాజ్యాంగబద్ధంగా అమలు కావాల్సిన 27 సంక్షేమ పథకాలను రద్దుచేసి, ఏ మొహం పెట్టుకుని అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని ప్రశ్నించారు. 4 లక్షల మంది దళితులకు టీడీపీ హయాంలో ఉపాధి కల్పించిన ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారన్నారు. దళిత బిడ్డలు విదేశాల్లో విద్యనభ్యసించేందుకు తీసుకొచ్చిన అంబేడ్కర్ విదేశీ విద్యాపథకాన్ని జగన్‌రెడ్డి నాలుగేళ్లపాటు అటకెక్కించారన్నారు. అంబేడ్కర్ పేరును తొలగించి, జగన్‌రెడ్డి విదేశీ విద్యగా మార్చి రాజ్యాంగ నిర్మాతనే అవమానపరిచారంటూ మండిపడ్డారు. దళిత బిడ్డలు సైతం కార్పొరేట్ విద్య అభ్యసించేందుకు చంద్రబాబునాయుడు బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకాన్ని అమలు చేస్తే.. జగన్‌రెడ్డి దానిని రద్దు చేశారన్నారు. 7748 మంది దళిత యువకులు ప్రయోజనం పొందిన సబ్సిడీ కార్ల పథకాన్ని రద్దు చేసి, దళితద్రోహిగా మారారన్నారు. ఎస్సీ, ఎస్టీ చెల్లెమ్మల వివాహానికి పెళ్లికానుక రూ.లక్ష ఇస్తానని మేనిఫెస్టోలో పొందుపరిచి, ఒక్కరికీ ఇవ్వలేదంటూ మండిపడ్డారు. కోడికత్తి డ్రామాలో దళిత బిడ్డ శ్రీనివాస్, అయేషా మీరా కేసులో దళితబిడ్డ సత్యంబాబును ఏళ్ల తరబడి జైలుపాలు చేశారన్నారు. జగన్‌కు క్రేజ్ రావడానికి దాడి చేశానని కోడికత్తి శీను చెప్పినా అతడి విషయంలో నేటికీ క్రూరంగా వ్యవహరిస్తున్నారన్నారు. శీను బెయిల్‌పై బయటకు రాకుండా చేస్తూ తల్లిదండ్రులకు క్షోభ మిగులుస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా నేత కేశగాళ్ల శ్రీనివాసులు, నాయకుడు కిరోసిన్ పోతులయ్య పాల్గొన్నారు.



నవ్విపోదురుగాక.. నాకేటి..!

'హంద్రీనీవా ద్వారా కృష్ణాజలాలు తీసుకొస్తాం. పుట్టపర్తి నియోజకవర్గంలోని వందల చెరువులు నింపుతాం. రిజర్వాయర్ కడతాం' అంటూ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ప్రగల్భాలు పలికారు. అధికారంలోకి వస్తే.. అంతా అభివృద్ధే అంటూ గొప్పలు చెప్పారు. ప్రజలు అధికారం కట్టబెట్టారు. శ్రీధర్ రెడ్డి ఎమ్మెల్యే అయ్యారు, వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఐదేళ్లవుతోంది. రిజర్వాయర్ కట్టింది లేదు, కాలువలు తవ్వింది లేదు.. చెరువులు నింపిందీ లేదు. శిలాఫలకాలు ఏర్పాటు చేసి, వదిలేశారు. మళ్లీ ఎన్నికలు దగ్గరపడ్డాయి. ఈ సమయంలో మళ్లీ ఎమ్మెల్యే శిలాఫలకాల డ్రామా మొదలెట్టారు. నవ్విపోదురుగాక.. నాకేటి అన్నట్లుగా 'రిజర్వాయర్ కడతాం.. నీరిస్తామం'టూ శిలాఫలకాన్ని ఆవిష్కరించి, ఏకంగా పాదయాత్రే చేపట్టారు. మరి ఈ ఐదేళ్లూ ఏం చేసినట్లో ఆయనే సమాధానం చెప్పాలి.

ఆంధ్రజ్యోతి | పుట్టపర్తి

- అటకెక్కిన నల్లగొండ రిజర్వాయర్ పనులు
- టెండర్ల దశలోనే ఆగిన దుస్థితి
- భూసేకరణ కూడా పూర్తికాని వైనం
- ఎన్నికల వేళ ఎమ్మెల్యే కొత్త నాటకం
- రిజర్వాయర్ కడతాం.. నీరిస్తామంటూ శిలాఫలకం ఆవిష్కరణ

పుట్టపర్తి నియోజకవర్గ పరిధి ఆరు మండలాల్లోని 193 చెరువులకు హంద్రీనీవా ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా జలాలు అందిస్తామని 2017 డిసెంబరు 19న పుట్టపర్తి నియోజకవర్గానికి వచ్చిన జగన్ ప్రతిపక్ష నేతగా ప్రకటించారు. రాయలసీమ కరవు నివారణ పథకం కింద 2021 జనవరిలో రూ.864.18 కోట్ల అంచనా వ్యయంతో ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఆ సమయంలో పుట్టపర్తి ఎమ్మెల్యే భారీ ఎత్తున రైతులు, ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. ఆదే ఏడాది మేలో సీఎంతో శంకుస్థాపన చేయించారు. 2022 డిసెంబరు నాటికి తొలివిడతగా పుట్టపర్తి, బుక్కపట్నంలోని అన్ని చెరువులకు నీరిస్తామని ప్రకటించారు. ఏడాదిన్నరలోపే ప్రాజెక్టు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఆ గడువు తీరిపోయింది. 2023 డిసెంబరు నాటికి నీరిస్తామని మళ్లీ ప్రకటించారు. ఆ గడువు కూడా దాటిపోయింది. పనులు మాత్రం ముందుకు కదల్లేదు. మరోసారి జనాన్ని నమ్మించే ప్రయత్నంలో నల్లమాడ మండలం నల్లగొండ రిజర్వాయర్ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేసి, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పాదయాత్రకు శ్రీకారం చూట్టారు. ఇన్నాళ్లకు రైతాంగం గుర్తుకొచ్చిందా, ఎవరిని నమ్మించడానికి ఈ పాదయాత్రలు అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు.

వైసీపీ ఓట్ల డ్రామా

2021లో టెండర్ నోటిఫికేషన్ ఇచ్చి 2022 ఫిబ్రవరి నాటికి ప్రక్రియ పూర్తి చేశారు. 36 నెలల్లో పూర్తి చేయాలన్న నిబంధన విధించారు. ఎమ్మెల్యే కుటుంబికులకు చెందిన ఏఎస్‌ఆర్ కంపెనీ, హైదరాబాద్‌కు చెందిన ఎస్‌సీఎల్‌తో కలిసి టెండర్లలో పాల్గొన్నారు. రూ.735 కోట్లతో పనులు దక్కించుకున్నారు. ఏడాదిన్నర పాటు పనులు కూడా మొదలు పెట్టలేదు. మూడేళ్లు గడిచినా ఉలుకూ పలుకూ లేదు. ఏడాది కిందటే వెంగళమ్మచెరువు వద్ద శిలాఫలకం ఏర్పాటు చేసి, వదిలేశారు. గతేడాది నవంబరు 7న పుట్టపర్తికి వచ్చిన సీఎం జగన్‌తో పుట్టపర్తి నియోజకవర్గంలో 193 చెరువులకు నీరిచ్చే ప్రాజెక్టును ప్రారంభింపజేసే ప్రయత్నాలు చేశారు. ప్రభుత్వం నిధులివ్వకపోవడంతోనే పనులు ఆగిపోయాయని అధికార పార్టీలోనే చర్చ సాగుతోంది. ఎమ్మెల్యే కుటుంబికులకు చెందిన కంపెనీకే పనులు అప్పగించారు. ఇప్పటికే ఎమ్మెల్యే సతీమణికి చెందిన మెసర్స్ సాయిసుధీర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ బ్యాంకులో తీసుకున్న రుణం చెల్లించకపోవడంతో గతేడాది ఏప్రిల్ నాటికి అసలు, వడ్డీ కలిసి రూ.908 కోట్లకు చేరడంతో కంపెనీ హామీదారుగా ఉన్న ఎమ్మెల్యే కుటుంబికుల ఆస్తులను వేలం వేస్తున్నట్లు బ్యాంకు ప్రకటన జారీ చేసింది. ఇది రాజకీయ ప్రకంపనలు రేపింది. ఈనేపథ్యంలో ఏఎస్‌ఆర్ కంపెనీకి రూ.737 కోట్ల ప్రాజెక్టు ఎలా అప్పగించారనేది అంతుచిక్కని ప్రశ్న.

పనులు ఎమ్మెల్యే కుటుంబికుల కంపెనీకే..



వెంగళమ్మచెరువు వద్ద ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం శిలాఫలకం





భూపరిహారం ఇవ్వకుండా పాదయాత్రా..?

ప్రాజెక్టు పనులకు టీడీపీ హయంలోనే 2018లో మంజూరు చేసి, డీపీఆర్ రూపొందించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక రెండేళ్ల తరువాత పాత డీపీఆర్‌ను ఆమోదించి నియోజకవర్గ వ్యాప్తంగా 193 చెరువులకు కృష్ణాజలాలు ఇవ్వాలని పథకం చేపట్టారు. ఆరు చోట్ల హంద్రీనీవా కాలువ నుంచి నీటిని ఎత్తిపోయాలి. 372 కి.మీ కాలువ తవ్వాలి. ప్రాజెక్టు కోసం 1200 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. నల్లగొండ, గాజులపల్లి రిజర్వాయర్ల ముంపునకు గురయ్యే భూములను గుర్తించి, నోటిఫికేషన్ జారీ చేశారు. భూనిర్వాసితులకు పరిహారం పంపిణీపై నేటికీ స్పష్టతలేదు. ప్రాజెక్టుకు పైసా కూడా నిధులివ్వలేదు. ఈ నేపథ్యంలో పనులెట్లా చేస్తారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ పరిస్థితుల్లో శిలాఫలకాన్ని ఆవిష్కరించడం, నీరిస్తామన్న ఎమ్మెల్యే వాగ్దానాలపై జనం మండిపడుతున్నారు.



బిల్లులు కాజేసే కుట్ర

▪ మాజీ మంత్రి పల్లె

పుట్టపర్తి: అధికారంలోకి వచ్చి ఐదేళ్లవుతున్నా.. చెరువులకు నీరివ్వలేకపోయిన ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి ఎన్నికల ఖర్చుల కోసం బిల్లులు కాజేసే కుట్రలో భాగంగా శిలాఫలకాల ఆవిష్కరణ డ్రామాకు తెరలేపారని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గంలోని 193 చెరువులకు కృష్ణాజలాలు తీసుకు వస్తామని గొప్పలు చెప్పిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి రైతులను నిండా మోసం చేశారని మండిపడ్డారు. శుక్రవారం టీడీపీ స్థానిక కార్యాలయంలో పల్లె మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్న వేళ 193 చెరువులకు నీరు నింపుతామని ఎమ్మెల్యే భూమిపూజ చేయడం శోచనీయమన్నారు. ఇదంతా ఎన్నికల జిమ్మిక్కు అన్నారు. ప్రజల ముందుకు ఏ మొహం పెట్టుకుని వెళ్తారని ప్రశ్నించారు. రైతులను మభ్యపెట్టడానికి సంకల్పయాత్ర చేపట్టారనీ, దీనిని ప్రజలు ఏమాత్రం విశ్వసించరన్నారు. టీడీపీ పాలనలో 2017లోనే నియోజకవర్గంలోని 193 చెరువులకు నీటిని నింపడానికి సంకల్పించామన్నారు. సర్వే చేయించి, డీపీఆర్ సిద్ధం చేశామన్నారు. వైసీపీ అధికారం చేపట్టాక రూ.735 కోట్లతో ఈ నుల కాంట్రాక్టును ఏఎస్‌ఆర్ కంపెనీ దక్కించుకుందన్నారు. ఇది ఎమ్మెల్యేది కావడంతో ఎన్నికల ఖర్చుల కోసం పనులు చేయకుండానే బిల్లులు చేసుకునే పన్నాగం పన్నుతున్నారని ఆరోపించారు. బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పులు కట్టలేని ఎమ్మెల్యే.. చెరువులకు నీరిస్తామంటూ కొత్త డ్రామాతో ప్రజాధనం స్వాహా చేసే కుట్ర పన్నుతున్నారన్నారు. ఇదంతా బూటకమన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే చెరువులు నింపుతామని హామీ ఇచ్చారు.

ఉద్యోగుల స్పందనలో 5 ఫిర్యాదులు

పుట్టపర్తి, జనవరి 19: స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన ఉద్యోగుల స్పందనలో ఐదు ఫిర్యాదులు అందాయి. డీఆర్వో కొండయ్య వాటిని స్వీకరించారు. 2019 నుంచి చెన్నేకొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న నబీరసూల్‌కు ఇంతవరకు సీపీఎస్ నంబరు రాలేదని అర్జీ ఇచ్చారు. పుట్టపర్తి బస్సు డిపోలో ఏడీసీగా పనిచేస్తున్న ధనుంజయ్ తాను అనారోగ్యంతో బాధపడుతున్ననీ, ఈ పరిస్థితుల్లో తనను మరో విధుల్లోకి మార్చడంతో పనిచేయలేకపోతున్నానని వివరించారు. ఉపాధి పథకంలో ఉద్యోగోన్నతులు కల్పించాలని ఎఫ్‌టీఈ టెక్నికల్ సిబ్బంది అర్జీ ఇచ్చారు.



రైతులకు భిక్షం వేసి, మద్దతు తెలుపుతున్న దివ్యాంగ భిక్షగాడు

ప్రోత్సాహకాల కోసం

వినూత్న నిరసన

అన్నదాతను రోడ్డున పడేశారని ఆవేదన

భిక్షాటన ద్వారా వచ్చిన డబ్బును ఇచ్చి, రైతులకు దివ్యాంగుడి మద్దతు

జోలెపట్టిన పట్టు రైతులు



భిక్షాటన ద్వారా నిరసన తెలుపుతున్న రైతులు, రీలర్లు

హిందూపురం అర్బన్, జనవరి 19: పట్టుగూళ్ల ప్రోత్సాహకం చెల్లింపులో ప్రభుత్వ నిర్లక్ష్యంపై పట్టు రైతులు వినూత్న నిరసన తెలిపారు. జోలెపట్టి, పట్టణ వీధుల్లో భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ప్రోత్సాహకం ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ పట్టు రైతులు, రీలర్లు చేపట్టిన నిరవధిక సమ్మె మూడోరోజు శుక్రవారం కూడా కొనసాగింది. స్థానిక పట్టుగూళ్ల మార్కెట్ ఎదురుగా ఏర్పాటు చేసిన దీక్షాస్థలి నుంచి రైతులు, రీలర్లు పట్టణంలో ర్యాలీ చేశారు. అనంతరం భిక్షాటన చూస్తూ నిరసన తెలిపారు. 'బాబూ.. మా పరిస్థితి బాగోలేదు. భిక్షమేయండి..' అంటూ వారు జోలె పట్టి అడిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమది రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటున్న పాలకులు.. అలాంటి అన్నదాతను రోడ్డున పడి అడుక్కునేలా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు కురవక, పంటలు పండక రైతులు నష్టాల ఊబిలోకి వెళ్తున్నారన్నారు. అరకొరగా పంటలు పండినా చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన చెందారు. కొద్దో.. గొప్పో.. పంట చేతికి వస్తే ఆ పంటకు గిట్టుబాటు ధర రాక ఊర్లు వదిలి పోతున్నారన్నారు. ఎకరాలకొద్దీ భూమి ఉన్నవారు కూడా నేడు కూలి పనులకు వెళ్తున్నారంటే రైతు ఎంత దయనీయ పరిస్థితిలో ఉన్నాడో అర్థం చేసుకోవాలన్నారు. రైతుల దీనావస్థను గమనించిన ఓ భిక్షగాడు తానూ రైతునేననీ, ఆ కష్టం తనకు కూడా తెలుసునని ఆవేదన చెందాడు. తాను భిక్షమెత్తగా వచ్చిన డబ్బు రైతులకు భిక్షంగా ఇచ్చి, వారి సమ్మెకు మద్దతు తెలిపాడు. ఈ దివ్యాంగ భిక్షగాడికి ఉన్న దయ కూడా.. సీఎం జగన్‌కు లేదని రైతులు, రీలర్లు విమర్శించారు. మునుపెన్నడూ రైతులకు ఇలాంటి పరిస్థితి రాలేదని ఆవేదన చెందారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, రైతులకు రావాల్సిన ప్రోత్సాహక బకాయిలను వెంటనే చెల్లించాలనీ, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సిద్దారెడ్డి, నాయకులు సోమశేఖర్, రాజేష్, నవీన్, జయరాంరెడ్డి, హనుమంతరెడ్డి, ఓపీడీఆర్ శ్రీనివాసులు, చైతన్య గంగిరెడ్డి, రీలర్లు అన్సార్, ముస్తఫా, ఖలీల్, రైతులు, రీలర్లు పాల్గొన్నారు.



సీఎంకు మంచి బుద్ధి ప్రసాదించాలని ఓబుళదేవరచెరువులో అంబేడ్కర్ చిత్రపటానికి వినతి

ముఖ్యమంత్రికి మంచిబుద్ధి ప్రసాదించాలని...

అంబేడ్కర్‌కు అంగన్‌వాడీల వినతి.. 39వ రోజుకు చేరిన సమ్మె

ఓబుళదేవరచెరువు, జనవరి 19: ముఖ్యమంత్రి జగన్‌కు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ శుక్రవారం అంగన్‌వాడీలు... అంబేడ్కర్ చిత్రపటానికి వినతిపత్రం సమర్పించారు. అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 39వ రోజుకు చేరుకుంది. జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీలు నిరసనలు కొనసాగించారు. ఓబుళదేవరచెరువు మండలం మహమ్మదాబాద్ క్రాస్ సీడీపీఓ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరంలో అంబేడ్కర్ చిత్రపటానికి అంగన్‌వాడీలు వినతి సమర్పిస్తూ నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కులను రాష్ట్ర ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. హిందూపురంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అంగన్‌వాడీలు సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో ఉద్యమాన్ని కొనసాగిస్తామని వారు ఉద్ఘాటించారు. అంతకుముందు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ధర్మవరం శిబిరంలో ఆయా సొమ్మసిల్లి పడిపోయారు. వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించారు.



హిందూపురం అంబేడ్కర్ సర్కిల్‌లో సత్యాగ్రహ దీక్ష చేపట్టిన అంగన్‌వాడీలు

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ

హిందూపురం అర్బన్: అంగన్‌వాడీ సిబ్బంది సమ్మెలో ఉండగా.. సెంటర్‌లో దొంగలు పడ్డారు. అంగన్‌వాడీ కేంద్రం తాళాలు పగులగొట్టి, అందులోని సరుకులు, సామగ్రిని అపహరించుకెళ్లారు. మండలంలోని చౌళూరు సెక్టారు దేవరపల్లి ఒకటో అంగన్‌వాడీ కేంద్రం తాళాలను బుధవారం రాత్రి దొంగలు పగులగొట్టి, అందులోని 18 కేజీల బియ్యం, 2 కిలోల కందిపప్పు, 5 ఆయిల్ ప్యాకెట్లు, 208 కోడిగుడ్లు, గ్యాస్ స్టౌ, సిలిండర్, 13 భోజనం ప్లేట్లను ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. అంగన్‌వాడీలు 39 రోజులుగా సమ్మెలో ఉండటంతో కేంద్రాలకు తాళాలు వేశారు. వాటిని గ్రామ సచివాలయ సిబ్బంది పగులగొట్టి, కొత్తవి వేసుకున్నారని సమాచారం. దీనిపై సీడీపీఓ రెడ్డిరమణమ్మను అడగ్గా.. చోరీ జరిగిన విషయం వాస్తవమేనన్నారు. పని ఒత్తిడి కారణంగా అంగన్‌వాడీ కేంద్రం వైపు వెళ్లలేదన్నారు. శనివారం కేంద్రాన్ని పరిశీలించి, చోరీపై విచారించి చర్యలు తీసుకుంటామని చెప్పుకొచ్చారు.



అంగన్‌వాడీ కేంద్రం తాళం పగులగొట్టిన దృశ్యం

వేమన జయంతిని మరువడం దురదృష్టకరం

రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేష్‌కుమార్‌రెడ్డి ఆవేదన



వేమన విగ్రహం వద్ద మాట్లాడుతున్న నరేష్‌కుమార్ రెడ్డి

గాండ్లపెంట, జనవరి 19: వేమన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం మరచిపోవడం దురదృష్టకరమని రెడ్డిసంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని కటారుపల్లిలోని యోగివేమన ఆలయాన్ని శుక్రవారం సందర్శించారు. వేమన సమాధికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎం జగన్ మోహన్‌రెడ్డి గతేడాది వేమన జయంతిని ఆర్భాటంగా నిర్వహించారన్నారు. అప్పటి సమావేశంలో పర్యాటక శాఖ మంత్రి రోజా ప్రతి యేడాది వేడుకలను ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందని హామీ ఇచ్చారన్నారు. ఈ ఏడాది ప్రభుత్వం తరపున కనీసం పూలమాల వేసే వారు కూడా కరువయ్యారన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బాబుల్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి హరినాథ్‌రెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, చవ్వా శ్రీనివాసరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, దాసిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేమన ఖ్యాతిని దశదిశలా చాటాలి

విగ్రహావిష్కరణలో వక్తలు



వేమన విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు

పెనుకొండ, జనవరి 19: వేమన ఖ్యాతిని దశదిశలా వ్యాప్తి చేయడానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం యోగివేమన జయంతిని పురస్కరించుకుని స్థానిక రెడ్డి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో పోస్టాఫీసు సర్కిల్‌లో యోగివేమన విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు నరేష్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేషాద్రిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏపీ టూరిజం డైరెక్టర్ జాహ్నవి హాజరయ్యారు. స్థానిక రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో న్యాయవాది భాస్కర్‌రెడ్డి, విగ్రహదాత జయశంకర్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, సుగుణాకర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డితో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో జాహ్నవి మాట్లాడుతూ వేమన ఖ్యాతిని దశదిశలా వ్యాపింపజేయడానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. అనంతరం అతిథులను సత్కరించారు.

మార్కెట్ ధరతో కందులు కొనుగోలు చేయండి

జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశం

అనంతపురం టౌన్ జనవరి 19: మార్కెట్ ధరతో పౌరసరఫరాల శాఖద్వారా జిల్లాలో కందులు కొనుగోలు చేయాలని జాయింట్‌కలెక్టర్ కేతన్‌గార్గ్ అధికారులు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీకాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో జేసీ మాట్లాడుతూ దళారులను నమ్మి రైతులు మోసపోకుండా కందులు కొనుగోలు చేయాలన్నారు. రైతుభరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని రైతులకు తెలియజేయాలని సూచించారు. రైతుభరోసా కేంద్రాలకు ఎరువులు సరఫరా చేయాలని ఆదేశించారు. రబీ పంటలకు సంబంధించి ఈ-క్రాప్ బుకింగ్, ఈకేవైసీ ప్రక్రియను వారంలోపు పూర్తి చేయాలన్నారు. తక్కువ నీటితో పండే చిరుధాన్యాలను రైతులు సాగుచేసే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, పశుసంవర్థకశాఖ జేడీ సుబ్రహ్మణ్యం, ఉద్యానశాఖ డీడీ రఘునాథరెడ్డి, పౌర సరఫరాలశాఖ డీఎం రవీంద్ర పాల్గొన్నారు.

వేమనకు నివాళి

అనంతపురం టౌన్, జనవరి 19: యోగివేమన జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న జేసీ

చిన్నతప్పు జరిగినా శిక్ష తప్పదు

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టరు, జేసీ, డీఆర్‌ఓ తదితరులు

అనంతపురం టౌన్, జనవరి 19: ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో ఏ చిన్న తప్పు జరిగినా శిక్ష తప్పదని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టరు గౌతమి, జేసీ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయిత్రీదేవి, ఆర్డీఓలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటర్ల నుంచి వచ్చిన క్లెయిమ్స్‌ వందశాతం పరిష్కరించాలని సూచించారు. ప్రజాప్రతినిధులకు సంబంధించి జాబితాలో ఓటు ఉందా లేదా..? తనిఖీ చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో నిబంధనల మేరకు మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత ఎన్నికల్లో ఎక్కడైనా గొడవలు జరిగాయా అనేది ముందుగానే గుర్తించి అక్కడ గట్టి బందోబస్తు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం కలెక్టర్ గౌతమి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి ఎన్నికల కమిషన్ ఆదేశాలను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు.

ఎమ్మెల్యే గెలుపు ముఖ్యం.. ఎంపీ కాదు..

వైసీపీ పురం సమన్వయకర్త దీపిక వ్యాఖ్యలు

అధికార పార్టీలో దుమారం

దీపిక కార్యక్రమాలకు శాంత దూరం

హిందూపురం, జనవరి 19: వైసీపీ హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక వ్యాఖ్యలు ఆ పార్టీలో దుమారం రేపుతున్నాయి. శుక్రవారం పట్టణ పరిధిలోని కొట్నూరులో దీపిక గడప గడపకు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణ పరిధిలోని ఓ నాయకుడు హిందూపురం పార్లమెంటు ఇన్‌చార్జి శాంతను కూడా గెలిపించాలనీ, ఎంపీ కూడా ముఖ్యమని పేర్కొన్నారు. దీనికి దీపిక మాట్లాడుతూ.. 'మనకు ఎమ్మెల్యే ముఖ్యం.. ఎంపీ కాదం'టూ ఆ నాయకుడి ముహంపైనే చెప్పేశారు. దీంతో అక్కడున్న నాయకులు కొద్దిసేపు మిన్నకుండిపోయినట్లు తెలిసింది. శాంత హిందూపురంలోనే ఉన్నా దీపిక చేపట్టే కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వచ్చినపుడు మాత్రం వేదికపై కలిశారు తప్ప.. దీపిక చేపట్టే కార్యక్రమాలకు దూరంగా ఉండటం పార్టీలో చర్చనీయాంశమైంది. దీపిక చేసిన వ్యాఖ్యలు శాంతకు తెలియడంతో అదిష్టానం దృష్టికి తీసుకెళ్లేందుకు యోచిస్తున్నట్లు సమాచారం. దీపికను తీసుకొచ్చింది పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కాగా.. శాంతను నేరుగా ముఖ్యమంత్రే తీసుకొచ్చినట్లు తెలిసింది. ఈ పరిస్థితుల్లో శాంత ఏ రకంగా దీనిపై స్పందిస్తారో.. వేచి చూడాలని వైసీపీలో కొంతమంది నాయకులు పేర్కొంటున్నారు.

బిందు సేద్య పరికరాలు బంద్

- ఎన్నికల భయంతో ఆపేసిన కంపెనీలు
- డబ్బు చెల్లించిన రైతులకూ మొండిచేయి
- జిల్లావ్యాప్తంగా వేలాది మంది రైతుల దరఖాస్తు

అనంతపురం అర్బన్





కరువు జిల్లాలో బిందు, తుంపర సేద్య పరికరాల సరఫరాను కంపెనీలు ఆపేశాయి. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నాయన్న కారణంగా కంపెనీలు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఎన్నికల కోడ్ అమలైతే తమకు డబ్బులు అందవని, ఎన్నికల తరువాత పెండింగ్ డబ్బులు ఇస్తారన్న గ్యారెంటీ ఉండదని కంపెనీల ప్రతినిధులు సందేహిస్తున్నారు. డ్రిప్ పరికరాల కోసం రైతులు నాన్ సబ్సిడీ డబ్బులు చెల్లించినా, సరఫరా చేయలేమని వారు అంటున్నారు. రెండు వారాల క్రితమే కంపెనీలు చేతులెత్తాశాయని సమాచారం. దీంతో జిల్లాలోని వేలాది మంది రైతులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పంపిణీ కొనసాగించాలి..

కరువు జిల్లాలో డ్రిప్ పరికరాల సరఫరాను ఉన్నట్లుండి నిలిపేయడం దారుణం. ఎన్నికలు సమీపిస్తున్నాయన్న కారణంతో కంపెనీలు ఇలా చేస్తే రైతుల పరిస్థితి ఏమిటి? పరికరాలు అందుతాయని పంటల సాగుకు సిద్ధమైన రైతులకు ఏం సమాధానం చెబుతారు? ప్రభుత్వం జోక్యం చేసుకుని, కంపెనీలకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించాలి. అర్హులైన రైతులందరికీ డ్రిప్ పరికరాలు సరఫరా చేసేలా చేయాలి. లేకపోతే రైతుల పక్షాన పోరాడుతాం.



- చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీ రైతు సంఘం

సమయం ఉన్నా..

2023-24 ఆర్థిక సంవత్సరం మార్చితో ముగుస్తుంది. నిబంధనల మేరకు మార్చి నెలాఖరు దాకా సూక్ష్మ సేద్య పరికరాల మంజూరుకు ఉత్తర్వులు ఇవ్వొచ్చు. కంపెనీలు వాటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. ఎన్నికల బూచి చూపించి సరఫరాను కంపెనీలు నిలిపేశాయి. డిసెంబరు నెలాఖరు వరకు కొన్ని కంపెనీలు సరఫరా చేసినా, ప్రస్తుతం అన్ని కంపెనీలు మూకుమ్మడిగా నిలిపేశాయి.

వేలాది మందికి మొండిచేయి..

జిల్లాలో 32 డ్రిప్ కంపెలకు లక్ష్యాన్ని విధించి, పరికరాలు సరఫరా చేసే బాధ్యతలను అప్పగించారు. 2023-24 సంవత్సరానికి 12,500 హెక్టార్లకు పరికరాలు సరఫరా చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఇప్పటి దాకా జిల్లావ్యాప్తంగా రైతు భరోసా కేంద్రాల్లో 26,806 మంది రైతులు 34,830 హెక్టార్లకు పరికరాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. టార్గెట్‌కు మించి ఈ సారి రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. వీరిలో 9,360 మంది రైతులు 11,424 హెక్టార్లకు నాన్‌సబ్సిడీ డబ్బులు చెల్లించారు. ఇందులో 9,314 మంది రైతులకు 11,375 హెక్టార్లకు డ్రిప్ మంజూరు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ ఇప్పటి దాకా 6,573 మంది రైతులకు 7,976 హెక్టార్లకు మాత్రమే పరికరాలను సరఫరా చేశారు. మిగిలిన రైతులకు మొండిచేయి చూపించారు.

ఎన్నికలతో సంబంధం ఏమిటి..?

రైతులకు డ్రిప్ పరికరాలు సరఫరా చేయడానికి, ఎన్నికలకు ఏం సంబంధం? డ్రిప్ కోసం నాన్ సబ్సిడీ డబ్బులు చెల్లించిన రైతులందరికీ ఈ ఆర్థిక సంవత్సరంలోగా పరికరాలు సరఫరా చేసేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వంపై నమ్మకం లేకనే కంపెనీలు చేతులెత్తేశాయి. కంపెనీలకు పెండింగ్ డబ్బులు చెల్లించి, వాటికి నమ్మకం కలిగించాలి. రైతులకు డ్రిప్ పరికరాలు అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.



- లక్ష్మీనారాయణరెడ్డి, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు

ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

వివరాలు వెల్లడించిన ఎస్పీ అన్బురాజన్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం, జనవరి 19: జిల్లాలోని గుంతకల్లు, అనంతపురం సబ్ డివిజన్ల పోలీసులు హౌస్ బ్రేకింగులకు పాల్పడే ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలతోపాటు 11 మందిని అరెస్ట్ చేశారు. రూ.30లక్షల విలువైన 30తులాల బంగారు, 920 గ్రాముల వెండి వస్తువులు, రూ.9,83,300 నగదు, 3.5తులాల గంజాయి, కారు, ఏడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అన్బురాజన్ అరెస్ట్ వివరాలను వెల్లడించారు. గుంతకల్లు సబ్ డివిజన్‌లోని ఉరవకొండ రూరల్ పోలీసులు కర్ణాటక రాష్ట్రం బాదామి జిల్లాకు చెందిన సతీష్‌గౌడ, కోప్పాళ్‌కు చెందిన రాజాసాబ్, గదగ్ జిల్లాకు చెందిన పరశురాంను అరెస్ట్ చేశారు. బెళుగుప్ప, ఉరవకొండ, రాయదుర్గం, గుంతకల్లు, గుత్తి, బొమ్మనహాళ్ ప్రాంతాలతోపాటు రాయచూరు, బీజాపూర్‌లలో హౌస్ బ్రేకింగ్‌లకు వీరు పాల్పడ్డారు. వీరిపై ఇదివరకే 8 కేసులు ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లో ఉన్నాయి. గుంతకల్లు డీఎస్పీ పర్యవేక్షణలో ఉరవకొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, బెళుగుప్ప ఎస్ఐ శివ ఆధ్వర్యంలో సిబ్బంది బృందంగా ఏర్పడి శుక్రవారం గుండ్లపల్లి క్రాస్ వద్ద వీరిని అరెస్ట్ చేశారు.

ఆరు బైక్‌లు స్వాధీనం: ఒకరి అరెస్ట్

గుంతకల్లు వన్‌టౌన్ పోలీసులు తిమ్మప్పను అరెస్ట్ చేసి ఆరు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. నకిలీ తాళాల సహాయంతో ఇళ్ల ముందున్న బైక్‌లను దొంగలించేవాడు. వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్యకు అందిన సమాచారం మేరకు శుక్రవారం సిబ్బందితో రైల్వేస్టేషన్ ఎక్స్ సర్కిల్‌లో అరెస్ట్ చేశారు.

గంజాయి, మట్కాతో సంబంధమున్న ఏడుగురి అరెస్ట్

మట్కా, గంజాయితో సంబంధమున్న ఏడుగురిని అనంతపురం వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలోని వేణుగోపాల్‌నగర్‌కు చెందిన చలపతి, గోవిందరాజులు, ఎన్టీఆర్ కాలనీకి చెందిన సుధాకర్, షికారి బాలచంద్ర, అశోక్ నగర్ మూడో క్రాస్‌కు చెందిన సెల్వా గణపతి, ఆదర్శనగర్‌లోని కొత్తకాపు జయసుధ, బుక్కరాయసముద్రం వీరభద్రకాలనీలోని నాగయ్యలను అరెస్ట్ చేశారు. వీరిలో చలపతి, గోవిందరాజులుకు మట్కా నిర్వహణ, గంజాయితో సంబంధాలున్నాయి. చలపతిపై మట్కా కేసులున్నాయి. వీరి నుంచి రూ.9,83,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఇద్దరు మిగిలిన ఐదుగురితో గంజాయి విక్రయాలు చేసేవారు. కొత్త కాపు జయసుధ విశాఖ ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి తక్కువ ధరకు కొనుగోలు చేసి తీసుకొచ్చి విక్రయాలు జరిపేది. వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప ఆధ్వర్యంలో ఏడుగురిని అరెస్ట్ చేశారు. సమావేశంలో గుంతకల్లు డీఎస్పీ నరసింగప్ప, జిల్లా స్పెషల్ బ్రాంచి, ఉరవకొండ రూరల్, గుంతకల్లు వన్‌టౌన్ సీఐ, వన్‌టౌన్ సీఐలు జాకీర్‌హుస్సేన్, ప్రవీణ్‌కుమార్, రామసుబ్బయ్య, రెడ్డప్ప, బెళుగుప్ప ఎస్ఐ శివ పాల్గొన్నారు.

సంఘటితంగా సాధించుకుందాం

మహాసమ్మేళనం పోస్టర్ల ఆవిష్కరణలో నాయకులు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

అనంతపురం సెంట్రల్, జనవరి 19: జనాభా దామాషా ప్రకారం దక్కాల్సిన ఆర్థిక, రాజకీయ, విద్య, వైద్య, సంక్షేమాన్ని సంఘటితంగా సాధించుకుందామని దళిత సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద మాదిగల మహాసమ్మేళనం పోస్టర్ల ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా దళిత సంఘం నాయకులు బంగినాగ మాట్లాడుతూ జిల్లాలో మాదిగల జనాభా అధిక సంఖ్యలో ఉన్నా అన్నిరంగాల్లో వెనుకబడటానికి ఐక్యత లోపించడమే కారణమన్నారు. అందరూ ఏకతాటిపై నడిచి భవిష్యత్తు నిర్మాణ సాధనకోసం మహాసమ్మేళనం నిర్వహించడం జరుగుతోందని పేర్కొన్నారు నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో 31న నిర్వహించే మాదిగల మహాసమ్మేళన సదస్సును విజయవంతం చేయాలని కోరారు అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు బీసీఆర్ దాస్, కేపీ నారాయణ స్వామి, సాకే శివకుమార్, సామ్రాట్ మధు, సర్పంచ్ బంగిమల్లేష్, దాసగాని కుళ్లాయప్ప, ఎల్లన్న, కదిరప్ప, చంద్ర, కేశవ, బడిగిరాజు, చెన్నప్ప, హర్షవర్ధన్, శాంతమ్మ, శంకర్, హర్షవర్ధన్, పృథ్వీ, పవన్‌కుమార్, నగేష్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి అరటి తోట ధ్వంసం

పుట్లూరు, జనవరి 19: మండలంలోని కుమ్మనమల గ్రామంలో టీడీపీ నాయకుడు ఓబన్న అరటి తోటను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అరటి తోటలో గెలలను శుక్రవారం తెల్లవారుజామున నరికివేశారు. ఓబన్న మొత్తం ఐదు ఎకరాలలో అరటి తోటను సాగు చేశాడు. ఓబన్న శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు తోట వద్దకు వెళ్లేసరికి నరికివేసిన అరటిగెలలు కనిపించాయి. దీంతో పోలీసులకు సమాచారం అందించాడు. తోటలో ఆరు వేల చెట్లు ఉండగా, 800 పైగా అరటి గెలలను నరికివేశారు. నెలరోజుల్లో చేతికి వచ్చే పంటను నరికివేయడంతో ఓబన్న కుటుంబ సభ్యులు బోరున విలపించారు. అరటి సాగుకు రూ.6.50 లక్షలు పెట్టుబడి పెట్టామని, పంట చేతికి వచ్చే సమయంలో నరికివేయడం దారుణమని వాపోయారు. సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ దిలీప్‌కుమార్ అరటితోటను పరిశీలించారు. బాధిత రైతుతో మాట్లాడి అనుమానితుల గురించి ఆరాతీశారు. డాగ్‌స్క్వాడ్‌తో అరటితోటలో తనిఖీలు నిర్వహించారు. రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



నరికివేసిన అరటి గెలలు

బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి

సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ నాగేశ్వరయాదవ్



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు

గుత్తి, జనవరి 19: బీసీలకు రాజ్యాధికారంలో తగిన ప్రాధాన్యత ఇవ్వకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెబుతామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ నాగేశ్వరయాదవ్ అన్నారు. శుక్రవారం గుత్తిఆర్ఎస్‌లో పత్తికొండ రోడ్డు సర్కిల్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీల రాజ్యాధికారం కోసం రథయాత్రను చేపట్టామన్నారు. జనాభా దామాషా ప్రకారం 90 అసెంబ్లీ, 13 పార్లమెంట్ స్థానాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం మాదిరిగానే బీసీ అట్రాసిటీ చట్టాన్ని అమలు పరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్ర అధ్యక్షుడు లకా వెంగళరావు, మహిళా అధ్యక్షురాలు నూకాలమ్మ, కర్నూలు జిల్లా అధ్యక్షుడు మురళి, నాయకులు రంగారెడ్డియాదవ్, వెంకటశివుడు, ఆనంద్, న్యాయవాది రమేష్, కృష్ణ, రాము, పవన్, శేఖర్, మహేష్, హరిచంద్ర, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు సీఐల బదిలీ

అనంతపురం క్రైం, జనవరి 19: ఉమ్మడి జిల్లా పరిధిలో నలుగురు సీఐలను బదిలీ చేశారు. శుక్రవారం అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్, ఎస్పీ, అనంతపురంలో ఉన్న సీఐ ఎం.శ్రీనివాసులును రాయదుర్గం యూపీఎస్‌కు బదిలీ చేశారు. రాయదుర్గం రూరల్ సర్కిల్‌లో ఉన్న వీ యుగంధర్‌ను శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ సర్కిల్‌కు బదిలీపై పంపారు. పెనుకొండ సర్కిల్ సీఐ వీ రాజారమేష్‌ను శ్రీసత్యసాయి జిల్లా, ఎస్పీ, వీఆర్‌కు, శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ, వీఆర్‌లో ఉన్న సీఐ జే ప్రసాద్‌బాబును రాయదుర్గం రూరల్ సర్కిల్‌కు బదిలీ చేశారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

నిర్వాహకుల అరెస్ట్

పెనుకొండ టౌన్, జనవరి 19: పట్టణంలోని వ్యభిచార గృహంపై గురువారం రాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించి పదిమందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పట్టణ శివారులో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడిచేసి ఓ మహిళ, ఆరుగురు విటులు, ముగ్గురు నిర్వాహకులను పట్టుకోవడం జరిగిందన్నారు. వీరి వద్ద నుంచి తొమ్మిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. నిర్వాహకులపై కేసునమోదు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. పట్టుబడ్డ మహిళ, ఆరుగురు విటులకు నోటీసులు అందించి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపినట్లు వివరించారు.

నియామకం

అనంతపురం అర్బన్, జనవరి 19: టీడీపీ ప్రొఫెషనల్స్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా తాడిపత్రి నియోజకవర్గానికి చెందిన పేరం శ్యాంసుందర్‌రెడ్డిని నియమించారు. ఆ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కళ్యాణదుర్గం నియోజకవర్గానికి చెందిన రాఘవేంద్రను ప్రకటించారు. శుక్రవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు.

రైళ్లకు తాత్కాలిక స్టాపింగ్స్

గుంతకల్లు, జనవరి 19: రైల్వేజోన్‌కు చెందిన పలురైళ్లను గుంతకల్లు రైల్వే డివిజన్‌లోని పలు స్టేషన్లలో తాత్కాలిక స్టాపింగ్స్‌ను కల్పిస్తున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముంబై-మధురై (నెం. 22101) రైలుకు గుత్తిలోనూ, కాచిగూడ-చెంగల్పట్టు (నెం. 17652) ఎక్స్‌ప్రెస్‌కు కోడూరులోనూ, నాగర్‌కోయిల్-ముంబై (నెం. 16352) ఎక్స్‌ప్రెస్‌ను యర్రగుంట్లలోనూ, మధురై-ముంబై (నెం. 22102) రైలుకు రాజంపేటలో స్టాపింగ్ కల్పించనున్నామని పేర్కొన్నారు. ముంబై-కరైకల్ (11017) రైలుకు గుత్తి, తాడిపత్రిలోనూ, తిరుపతి-ఔరంగాబాద్ (నెం. 17622), మధురై-చెన్నై సెంట్రల్ (నెం. 22179) ఎక్స్‌ప్రెస్‌లకు ఆదోనిలోనూ, యశ్వంతపూర్-లక్నో (నెం. 22683) ఎక్స్‌ప్రెస్‌కు అనంతపురంలో స్టాపింగ్ ఉంటుందని వివరించారు. స్టాపింగ్‌లు శుక్రవారం నుంచి ఆరునెలలపాటు అమలులో ఉంటాయని తెలిపారు.

రేపు మూర్ఛవ్యాధి వైద్యశిబిరం

అనంతపురం కల్చరల్, జనవరి 19: జనవిజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జేవీవీ జిల్లా కార్యాలయంలో మూర్ఛవ్యాధి బాధితులకు వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు జేవీవీ కన్వీనర్ రామకృష్ణ, నగరాధ్యక్షుడు రామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరానికి విజయవాడ నుంచి ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టర్ శివన్నారాయణ హాజరై వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు ఉచితంగా ఇస్తారని తెలిపారు. బాధితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి చిరుధాన్యాల పండుగ

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 19: 'మన పంటలు-మన వంటలు' నినాదంతో శనివారం నుంచి అనంత చిరుధాన్యాల పండుగ ప్రదర్శన జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ వైవి మల్లారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు అనంత చిరుధాన్యాల పండుగ-2024 ఉంటుందన్నారు. శనివారం చిరుధాన్యాలతో ఆరోగ్యం, సాగు అంశాలపై సదస్సు, ఆదివారం సాగులో మెళకువలు, సహభాగ ధృవీకరణ పద్ధతి, స్వల్పకాలిక చిరుధాన్యాల రకాల సాగుపై అవగాహన ఉంటుందన్నారు. 22వ తేదీ చిరుధాన్యాల ప్రాసెసింగ్-విలువ ఆధారిత ఉత్పత్తులు అంశంపై శాస్త్రవేత్తలు ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక



కందికుంట యశోదమ్మ ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు

కదిరి, జనవరి 19: తలుపుల మండలం సంగటివారి పల్లి గ్రామానికి చెందిన 20 కుటుంబాల వైసీపీ శ్రేణులు శుక్రవారం టీడీపీలోకి చేరారు. కదిరి పట్టణంలోని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ నివాసంలో ఆయన సతీమణి కందికుంట యశోదమ్మ సమక్షంలో వారు చేరారు. చేరినవారిలో బాల బయ్యప్ప, రెడ్డిశేఖర్, మల్లికార్జు న, రవీంద్ర, వెంకటసుబ్బయ్య, బయప్ప, బాలబయన్న, ఎర్ర మల్లయ్య, శంకర్, ప్రసాద్, పాపయ్య, రమణ, మల్లేష్, రామచంద్ర, కుమార్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మేడా శంకర్, రామమోహన్, విశ్వనాథ్‌రెడ్డి, శ్రీశైలం రమణ, జయచంద్ర, బాబ్‌జాన్, షేక్ బక్షు, చిన్న మలేష్, వసంతనాయుడు, అమర, గట్టి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కులగణనను పకడ్బందీగా చేపట్టాలి: జేసీ



కులగణన సర్వేను పరిశీలిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

పుట్టపర్తి, జనవరి 19: జిల్లాలో కులగణనను పకడ్బందీగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని గోకులంలో శుక్రవారం జరిగిన కులగణన సర్వే ప్రక్రియను జేసీ పరిశీలించారు. కులగణనపై సర్వే వివరాలను సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాకపూర్వం 1931లో కులగణన జరిగిందన్నారు. కులగణనపై ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు. పేదరిక నిర్మూలనకు, అర్హులకు సంక్షేమపథకాలు అందించడానికి కులగణన ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కులగణకు వచ్చే అధికారులకు, సిబ్బందికి ప్రజలు పూర్తి సమాచారం అందించాలని కోరారు. ఈనెల 28 వరకు కులగణన సర్వే జరుగుతుందన్నారు. సచివాలయ ఉద్యోగులు ఇంటింటికెళ్లి వివరాలు సేకరిస్తారని చెప్పారు. ఆయనవెంట సీపీఓ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషన్ రాంభూపాల్‌రెడ్డి, ఆర్‌ఐ నరసింహులు ఉన్నారు.

ప్రారంభమైన కులగణన సర్వే

ధర్మవరం: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలో శుక్రవారం సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు కులగణన సర్వేను ప్రారంభించారు. ఈ సర్వేను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పరిశీలించి మాట్లాడారు. పట్టణంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటా తిరిగి కులగణన సర్వే చేస్తున్నారన్నారు. ఎక్కడికక్కడే కులగణనను ఆన్‌లైన్ యాప్ ద్వారా నమోదు చేస్తున్నారు. ఇందుకు ప్రజలు సమాచారంతో సహకరించాలన్నారు. సర్వేకు వచ్చినపుడు ఎవరైనా మిస్ అయితే మరో ఐదు రోజులు అవకాశం ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తరువాత ఇంటి యజమాని వేలిముద్రలతో మ్యాపింగ్ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యోగివేమనకు ఘన నివాళి



కలెక్టరేట్‌లో వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఆర్వో కొండయ్య తదితరులు

పుట్టపర్తి, జనవరి 19: ప్రజాకవి యోగివేమన జయంతి వేడుకలను పట్టణంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన చిత్రపటానికి డీఆర్వో కొండయ్య, ఇతర అధికారులు పూలామాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డీఆర్వో మాట్లాడుతూ.. యోగి వేమన ప్రజల జీవన ప్రమాణాలను పద్యరూపంలో రచించి, ప్రజాకవిగా గర్తింపు పొందారన్నారు. విశ్వదాభిరామ వినురవేమ అనే మాటను వినని తెలుగువారుండరని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, సాంఘిక సంక్షేమ శాఖాధికారి శివరంగప్రసాద్, గిరిజన సంక్షేమశాఖాధికారి మోహన్‌రామ్, పర్యాటక శాఖ మేనేజర్ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జయంతి

ధర్మవరం: యోగివేమన జయంతి వేడుకలను పట్టణంలో రెడ్డి జేఏసీ నాయకులు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జేఏసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కామాటం శేషాద్రిరెడ్డి, నాయకులు రంగారెడ్డి, మాధవరెడ్డి, కోళ్లమొరం చంద్రశేఖర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల సంఘం నిబంధనల మేరకే ఓటరు జాబితా: జేసీ

పుట్టపర్తి, జనవరి 19: ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనల మేరకే ఓటరు జాబితా, ప్రత్యేక సవరణ, తుది జాబితా రూపొందిస్తున్నామని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేష్‌కుమార్ ఓటర్ల జాబితా సవరణపై వీడియో కాన్ఫరెన్స్‌లో అమరావతి నుంచి సమీక్షించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ పాల్గొని జిల్లాలో చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ పై వివరించారు. జిల్లాలో ఎన్నికల నిర్వాహణకు సిద్ధంగా ఉన్నామని, సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇవ్వడానికి ప్రణాళిక రూపొందించామన్నారు. తప్పుల్లేని ఓటరు తుదిజాబితా సిద్ధమవుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీవో భాగ్యరేఖ, ఎన్నికల సూపరిండెంట్ మైనొద్దీన్ ఉన్నారు.

మహిళలకు ఉపాధి కల్పించడమే నాబార్డు లక్ష్యం

బుక్కపట్నం, జనవరి 19: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే నాబార్డు లక్ష్యమని నాబార్డు జిల్లా డెవలప్‌మెంట్ మేనేజర్ అనూరాధ తెలిపారు. మండలకేంద్రంలోని వెలుగు కార్యాలయంలో శుక్రవారం జీవ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు రోలింగ్, పట్టుచీర పాలిష్‌పై శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా అనూరాధ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా 15రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. శిక్షణ కాలంలో స్టైపండ్‌తో పాటు, బ్యాంకులద్వారా రుణాలు ఇప్పిస్తామన్నారు. మహిళలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తొలుత ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వెలుగు సీసీ విశాలాక్షి, స్వచ్ఛంద సంస్థ సెక్రటరీ రమీజాబీ, బ్యాంక్ కోఆర్డినేటర్ పద్మావతి, రూట్‌సెంట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

'రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వాలు'

పుట్టపర్తి, జనవరి 19: రైతులను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు విద్యుత్ సంస్కరణల పేరుతో మోసం చేస్తున్నాయని ఏపీ రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిండెంట్ కాటమయ్య మండిపడ్డారు. రైతులను ఆదుకోవాలంటూ శుక్రవారం ఆయన జిల్లా ప్రధాన కార్యదర్శి జేవీ రమణ, రైతులతో కలిసి పట్టణంలో ఏఓ వెంకటనారాయణకు వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ.. వ్యవసాయమోటార్లకు స్మార్టుమీటర్లు బిగిస్తున్నారని, తద్వారా రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. ఇప్పటికే అధికారులు రైతుల వివరాలు సేకరిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు స్మార్టుమీటర్ల పేరుతో రైతులను నట్టేట ముంచనున్నాయన్నారు. ప్రభుత్వం ఈ ప్రక్రియను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు చలపతి, ముత్యాలప్ప, చంద్ర, చౌడప్పయాదవ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

22న జయహో బీసీ

ముదిగుబ్బ, జనవరి 19: మండలకేంద్రంలో ఈనెల 22వ తేదీన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు టీడీపీ మండల నాయకులు తెలిపారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జయహో బీసీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి, మాజీ ఎంపీ నిమ్మలకిష్టప్ప, మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, జిల్లా నాయకులు అంబికా లక్ష్మీనారాయణ, సవితమ్మ తదితరులు హాజరవుతారని తెలిపారు. మొదటిగా బైక్ ర్యాలీ ఉంటుందన్నారు. తర్వాత షాదీమహల్ వద్ద సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు రమేష్‌బాబు, కరణంప్రభాకర్, తుమ్మలమనోహర్, కనుమ చంద్ర, మహబూబ్‌పీరా, చికెన్ తిరుపాల్, వినోద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేది బూటకపు యాత్ర

అమడగూరు, జనవరి 19: ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి రైతు సంకల్పయాత్ర కాదని, బూటకపు యాత్ర అని టీడీపీ మండల కన్వీనర్ గోపాల్‌రెడ్డి విమర్శించారు. మండలకేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శ్రీధర్ రెడ్డి గత ఎన్నికల ప్రచారంలో నియోజకవర్గంలోని 193 చెరువులకు నీటిని నింపుతానని హామీ ఇచ్చారని, ఎమ్మెల్యే అయి ఐదేళ్లు గడుస్తున్నా.. నేటికి ఒక్క చెరువుకు కూడా నీరు నింపలేదని అన్నారు. ఇప్పుడు మాత్రం ఎన్నికలు సమీపిస్తున్నందున రైతులను మభ్యపెట్టడం కోసం చెరువులకు నీటిని నింపుతామని రైతు సంకల్పయాత్ర పేరుతో బూటకపు యాత్ర ప్రారంభించారని తెలిపారు. ప్రజలు ఆయన్ను నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. సమావేశంలో నాయకులు క్రిష్టారెడ్డి, టైలర్ రామాంజులు, డేగాని క్రిష్టారెడ్డి, నాగేంద్రరెడ్డి, నారాయణ, సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

కనీస వసతులు కూడా కల్పించకపోతే ఎలా?

- ఎక్కడ చూసినా డ్రైనేజీ, సీసీరోడ్లు, తాగునీటి సమస్యలే కనిపిస్తున్నాయి
- టీడీపీ అధికారంలోకి రాగానే అన్నింటినీ పరిష్కరిస్తాం
- భవిష్యత్తుకు గ్యారెంటీలో పరిటాల శ్రీరామ్



సమస్యలను పరిటాల శ్రీరామ్‌కు విన్నవిస్తున్న కాలనీవాసులు

ధర్మవరం, జనవరి 19: ధర్మవరం నియోజకవర్గంలో చాలాచోట్ల కనీస వసతులు లేవని, దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎల్-1, ఎల్-2 కాలనీల్లో శుక్రవారం సాయంత్రం ఆయన బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టో పథకాలను ప్రజలకు కరపత్రాలు పంచుతూ వివరించారు. ఎవరెవరికి ఏ పథకం ద్వారా ఏ మేరకు లబ్ధి చేకూరుతుందో తెలియజేశారు. అనంతరం కాలనీలో తాగునీరు, డ్రైనేజీ, సీసీ రోడ్లు తదితర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని పరిటాలశ్రీరామ్ దృష్టికి కాలనీ వాసులు తీసుకెళ్లారు. ఇందుకు ఆయన మాట్లాడుతూ.. నియోజకరవ్గంలో ఎక్కడ చూసినా ఈ సమస్యలే కనిపిస్తున్నాయని, పాలకులు రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు లాంటివి కూడా అందించకపోతే ఎలా అని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలోకి రాగానే కాలనీలోని సమస్యలను తప్పక పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు కమతం కాటమయ్య, ఫణికుమార్, పరిశే సుధాకర్, భీమనేనిప్రసాద్‌నాయుడు, పురుషోత్తంగౌడ్, అంబటి సనత్, నాగూర్‌హుస్సేన్, రాళ్లపల్లిషరీఫ్, గరుగువెంగప్ప, కత్తుల బాబ్జీ, పఠాన్‌బాబూఖాన్, పల్లపు శంకర్, బొట్టుకిష్ట, ఓంకార్, కేతినేని రాజ, క్లస్టర్ రామాంజి, అమర్‌నాథ్‌చౌదరి, కేశవ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- అంగన్‌వాడీల డిమాండ్
- ధర్మవరంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట మోకాళ్లపై నిలబడి నిరసన



ధర్మవరంలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ధర్మవరం, జనవరి 19: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం నాటికి 39వ రోజుకు చేరింది. పట్టణంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీవర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీదేవి, కోశాధికారి దేవి మాట్లాడుతూ.. రోజుల తరబడి అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం స్పందించకపోవడంతో శోచనీయమన్నారు. సమస్యలను పరిష్కరించకపోగా.. కక్షసాధింపుచర్యలకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీఐటీయూ మండల అధ్యక్షుడు ఎల్ ఆదినారాయణ, కార్యదర్శి అయూబ్‌ఖాన్, ట్రాన్స్‌పోర్ట్ రంగం రాష్ట్ర నాయకులు రఫీ, అంగన్‌వాడీ ప్రాజెక్టు యూనియన్ నాయకురాళ్లు పోతక్క, దీనా, చింతమ్మ, మాంచాలి దేవి, గంగమ్మ, విజయ, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కదిరిఅర్బన్: పట్టణంలో అంగన్‌వాడీలు సమ్మెను కొనసాగించారు. ఇందుకు సీఐటీయు నాయకులు నరసింహులు మద్దతు తెలిపి మాట్లాడారు. న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు 39 రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

నల్లమాడ: మండలకేంద్రంలోని అంగన్‌వాడీలు సమ్మె కొనసాగించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద సమ్మె చేపట్టారు. తమసమస్యలు పరిష్కరించేవరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ముదిగుబ్బ: మండలకేంద్రంలో అంగన్‌వాడీలు సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా వారు సమ్మె శిబిరం వద్ద అంబేడ్కర్ విగ్రహం ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ....తమకు కనీస వేతనం రూ.26వేలు పెంచాలని, గ్రాట్యూటీ రూ.5లక్షలు ఇవ్వడంతోపాటు తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి ఆటోపెద్దన్న, నాయకులు బండల వెంకటేశ్ పాల్గొన్నారు.



నల్లమాడలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళి..



కదిరిలో సమ్మె..



ముదిగుబ్బలో ధర్నా

'అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత జగన్‌కు లేదు'



కదిరిలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రమిస్తున్న టీడీపీ ఎస్సీసెల్ నాయకులు

కదిరి, జనవరి 19: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత సీఎం జగన్‌కు లేదని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర నాయకుడు రాజశేఖర్‌బాబు పేర్కొన్నారు. పట్టణంలోని శుక్రవారం ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో దళితులపై దాడులు, వేధింపులు అధికమయ్యాయన్నారు. దళితులకు పథకాలు రద్దు చేసి, వారికి అన్యాయం చేశారన్నారు. ఎస్సీసెల్ నాయకుడు విశ్వనాథ్ మాట్లాడుతూ దళితులపై సీఎం కపట ప్రేమ చూపుతున్నారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి దళిత ద్రోహిగా అభివర్ణించారు. అనంతరం విజయవాడలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం జగన్ ఆవిష్కరించరాదంటూ స్థానిక అంబేడ్కర్ విగ్రహానికే వారు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డెప్ప, రమణ, కదిరప్ప, లక్ష్మణ, గంగాధర్, రామచంద్ర, ఆంజనేయులు, రాఘవ, అనిల్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత లేదని సీఎం జగన్‌కు లేదని టీడీపీ దళిత సంఘం నాయకులు పేర్కొన్నారు. మండలకేంద్రంలోని అనంత మహిళా మండలి కుట్టు శిక్షణ కేంద్రంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విజయవాడలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత ముఖ్యమంత్రికి లేదన్నారు. దళితులకు రాజ్యాంగంలో కల్పించిన హక్కులను ముఖ్యమంత్రి జగన్ తుంగలో తొక్కారన్నారు. అలాగే ఎస్సీల అభ్యున్నతికి అమలు చేస్తున్న 27 పథకాలను రద్దు చేయడంతో పాటు ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. వైసీపీ పాలనలో దళితులకు ఎలాంటి మేలు జరగలేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ దళిత నాయకులు చిన్నప్ప, చంద్రప్ప, కుళ్లాయప్ప, శ్రీనివాసులు, వేమనారాయణ, ఓబులేసు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దళితులపై సీఎం కపట ప్రేమ

ఓబుళదేవరచెరువు: సీఎం జగన్ దళితులపై కపట ప్రేమను చూపిస్తున్నారని, పలు ఆర్థిక కేసుల్లో నిందితుడిగా ఉన్న ఆయనకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత లేదని ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బడిశం రామాంజనేయులు పేర్కొన్నారు. మండలంలోని కొండకమర్ల టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక దళితులపై దాడులు, వేధింపులు అధికమయ్యాయన్నారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో సీఎం జగన్ దళితులపై కపట ప్రేమను చూపిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో దళితులు టీడీపీ వెంట ఉంటారని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్సీసెల్ నాయకులు సీ. సురేష్, దారా శ్రీనివాసులు, పూల రామాంజి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ జీవోను రద్దు చేయాలి

ఓబుళదేవరచెరువు, జనవరి 19: కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న హిట్ అండ్ రన్ జీవోను రద్దు చేయాలని కోరుతూ మండలకేంద్రంలో ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా సీఐటీయూ నాయకులు బావావలి, కుళ్లాయప్ప మాట్లాడుతూ కేంద్రం అమలు చేసే హిట్ అండ్ రన్ జీవోను రద్దు చేయాలని కోరారు. ఈ కేసులతో డ్రైవర్లకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. వెంటనే ఈ జీవోను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో భగత్‌సింగ్ ఆటోయూనియన్ ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, నాయకులు, డ్రైవర్లు వెంకటరమణ, నారప్ప, నరసింహులు, రఘు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి

తనకల్లు, జనవరి 19: మండలంలోని గోళ్లవారిపల్లి గ్రామం వద్ద ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని ఆ గ్రామస్థులు శుక్రవారం మండలకేంద్రంలో తహసీల్దార్ శోభాసువర్ణమ్మను కలిసి వినతిపత్రం సమర్పించారు. పలువురు మాట్లాడుతూ గ్రామంలోని సర్వేనెంబర్ 1504లో గల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతోందన్నారు. గ్రామానికి చెందిన కొంతమంది ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం, హెల్త్‌సెంటర్, బల్క్‌కూలింగ్ సెంటర్, గ్రంథాలయం, అగ్రికల్చర్ గోడౌన్ తమ గ్రామానికి మంజూరు అయ్యాయని, స్థలాలు లేకపోవడంతో వీటిని నిర్మించలేదని అన్నారు. ఉన్న ప్రభుత్వ స్థలాలను అక్రమించుకుంటుంటే ప్రభుత్వ కార్యాలయాల భవనాలు ఎక్కడ నిర్మించాలని ఆవేదన చెందారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రీడలతో మానసికోల్లాసం: సీఐ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఐ సుబ్రహ్మణ్యం

ధర్మవరం, జనవరి 19: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం సూచించారు. సంక్రాంతి పండగ సందర్భంగా చెరువు కట్ట వద్ద గల శివాలయం సమీపంలో నాలుగు రోజులుగా నిర్వహించిన షటిల్ టోర్నీ శుక్రవారం ముగిసింది. బహుమతుల పంపిణీకి ముఖ్యఅతిథిగా వన్‌టౌన్ సీఐ విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో అవసరమన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపిన వారు ఎంతో మంది ఉన్నతస్థాయికి చేరుకున్నారని తెలిపారు. అనంతరం టోర్నీ విజేతలు రంగం చైతన్యకుమార్, యంబా లోకేశ్‌కు మొదటి బహుమతిగా రూ.10వేలు, మదన్‌మోహన్, నిమిట్టి ఆదినారాయణకు రెండో బహుమతిగా రూ.5వేలు, గుణశేఖర్, విజయ్‌కు మూడో బహుమతిగా రూ.2500, రమేశ్, అలీకి నాలుగో బహుమతిగా రూ.1000 చొప్పున నగదును సీఐ అందజేశారు. కార్యక్రమంలో టోర్నీ నిర్వహకులు ఫయాజ్, మహేంద్ర, మదన్‌మోహన్, మేకల పురుషోత్తం, మురళీకృష్ణ, విజయరాఘవ, వాసు, రామాంజినేయులు, ఆదినారాయణ పాల్గొన్నారు.

శ్రీరాముడి అక్షింతల పంపిణీ

ధర్మవరంరూరల్, జనవరి19: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షింతలను పట్టణంలోని ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ రాజేశ్వరి, సిబ్బందికి ఆర్‌ఎస్‌ఎస్ ధర్మవరం నాయకుడు అన్నం అరవింద్ శుక్రవారం పంపిణీ చేశారు. అయోధ్య రాముడి పూజిత అక్షింతలు, స్వామివారి ఆలయ ప్రారంభోత్సవ కరపత్రాలను అందజేసి వాటి గురించి వివరించారు. సిబ్బంది భక్తిభావంతో అక్షింతలను స్వీకరించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు



గాయపడిన ఆంజనేయులు, లక్ష్మీభార్గవి, జితేంద్ర

తనకల్లు, జనవరి 19: మండలంలోని గంగసానిపల్లి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. బంధువులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. అమడగూరు మండలం కందుకూరిపల్లికి చెందిన ఆంజనేయులు భార్య లక్ష్మీ భార్గవి, కుమారుడు జితేంద్ర, కుమార్తె జాహ్నవితో కలిసి బైక్‌లో అన్నమయ్య జిల్లాలోని హార్సిలీ హిల్స్‌కు బయలుదేరారు. కాగా గంగసానిపల్లి వద్దకు రాగానే రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. రోడ్డుపై ఆర్టీసీ బస్సు ఆగి ఉండగా.. దానికి సైడ్ ఇచ్చి వెళ్తుతుండగా, ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. ప్రమాదంలో ఆంజనేయులు, లక్ష్మీభార్గవి, జితేంద్రకు కాళ్లు విరిగి తీవ్రగాయాలయ్యాయి. అదృష్టవశాత్తూ కుమార్తె జాహ్నవికి ఏమీ కాలేదు. స్థానికులు క్షతగాత్రులను 108 వాహనంలో తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత బంధువులు కదిరికి, అక్కడి నుంచి తిరుపతికి తరలించారు. ఆంజనేయులు అమడగూరు మండల జనసేనపార్టీ అధ్యక్షుడిగా ఉన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

ధర్మవరం, జనవరి 19: ప్రతి డ్రైవర్ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషిచేయాలని వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం సూచించారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో శుక్రవారం డీఎం సత్యనారాయణ అధ్యక్షతన రోడ్డు భద్రతా మాసోత్సవాలు జరిగాయి. ముఖ్యఅతిథిలుగా వన్‌టౌన్, టూటౌన్ సీఐలు సుబ్రమణ్యం, అశోక్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ సుబ్రమణ్యం మాట్లాడుతూ.. ప్రతిడ్రైవర్ తొలుత బస్సు కండీషన్ చెక్ చేసుకుని రోడ్డుపైకి తీసుకురావాలన్నారు. పూర్తి ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయాలని తెలిపారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడపరాదన్నారు. అనంతరం టూటౌన్ సీఐ మాట్లాడుతూ.. మానవతప్పిదాల వల్ల మాత్రమే 80శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అప్రమత్తతో డ్రైవింగ్ చేస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, ఆఫీస్ సూపరింటెండెంట్ ప్రేమ్‌కుమార్, ఏఈ సికిందర్, గ్యారెజ్ కార్మికులు పాల్గొన్నారు.

22న సెలవు ప్రకటించాలి

కదిరి అర్బన్, జనవరి 19: అయోధ్య రామాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఈనెల 22వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రటనలో కోరారు. హిందూవుల ఆరాధ్యదైవమైన శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ జరిగే రోజున సెలవు ప్రకటించాలని అన్నారు.

నేడు బైక్‌ర్యాలీ

పుట్టపర్తి, జనవరి 19: జయహో బీసీ కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 9గంటలకు బైక్‌ర్యాలీ నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదట బైక్‌ర్యాలీ కర్ణాటక నాగేపల్లినుంచి ప్రారంభమై వెంగలమ్మచెరువు, చెర్లోపల్లి, బొంతపల్లి, గంగారెడ్డిపల్లి, పెడబల్లి, పైపల్లి, బత్తలపల్లి, కప్పలబండ, మామిళ్లకుంట క్రాస్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, బ్రాహ్మణపల్లి, యనుములపల్లి మీదుగా సత్యమ్మ ఆలయం వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం అక్కడ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. బైక్ ర్యాలీలో బీసీలు పాల్గొనాలని కోరారు.

రాముడి విగ్రహ ప్రతిష్ఠను పండుగలా జరపాలి

ధర్మవరం, జనవరి 19: అయోధ్యలో ఈ నెల 22వ తేదీన శ్రీరాముడి విగ్రహప్రతిష్ఠ జరగనుందని, కావున కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ పండుగలా జరుపుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం అసెంబ్లీ కన్వీనర్ గంగులకుంట గోపాల్‌రెడ్డి, జిల్లాఉపాధ్యక్షుడు సాకే ఓబులేశు విలేకరులతో మాట్లాడారు. సుమారు 500 ఏళ్లుగా ఎదురుచూస్తున్న భారతీయుల కల ఇప్పుడు సాకారం అవుతోందన్నారు. అయోధ్య తీర్థ క్షేత్రట్రస్టు వారు ఇప్పటికే దేశంలో ఉన్న ప్రతి ఇంటికీ రాముల వారి అక్షింతలు, చిత్రపటాలను అందజేశారన్నారు. రాములవారి విగ్రహ ప్రాణప్రతిష్ఠ ఒక పండుగ వాతావరణంలో ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా జరగనుందన్నారు. కావున నియోజకవర్గంలో ప్రతిదేవాలయంలో ప్రజలు భజన కార్యక్రమాలు, పూజలు జరపాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



పూల లోకేష్ (ఫైల్)

కదిరి అర్బన్, జనవరి 19: పట్టణ పరిధిలోని గజ్జలరెడ్డిపల్లిలో యువకుడు ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తనకల్లు మండలం కొక్కంటిక్రాస్‌కు చెందిన పూల లోకేష్ (21) ఏడాదిగా కదిరి పట్టణంలోని గజ్జలరెడ్డిపల్లిలో అమ్మమ్మ రామాంజులమ్మ వద్ద ఉంటూ బైక్ మెకానిక్ షెడ్డులో పని చేస్తున్నాడు. ఏడాది క్రితం తన తల్లి మరణించింది. అప్పటి నుంచి అమ్మమ్మ వద్ద ఉంటున్నాడు. కాగా దురవాట్లుకు బానిసయ్యాడు. శుక్రవారం తన జన్మదినం సందర్భంగా స్నేహితులతో పార్టీ చేసుకోవాలని, అందుకు డబ్బులు ఇవ్వాలని అమ్మమ్మను అడిగాడు. అందుకు ఆమె నిరాకరించడంతో తీవ్రమనస్థాపానికి గురై.. ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల వారు అతన్ని కిందికి దించి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి అమ్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

తనకల్లు, జనవరి 19: మండలంలోని మార్పురివాండ్లపల్లిలో శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, ఎస్సీఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గంగులయ్య సొంత నిధులతో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పూల నరసింహులు, సర్పంచ్ శ్రీనివాసులు, బాలసముద్రం ఎంపీటీసీ మెంబర్ అమర్ కార్తికేయ, బీసీ ప్రచార కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటకొండ కిష్టప్పతో పాటు వివిధ కుల సంఘాల నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



మార్పురివాండ్లపల్లిలో అంబేడ్కర్ విగ్రహం

తుమ్మల మారెమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో తుమ్మల మారెమ్మ

గుడిబండ, జనవరి 19: మండలకేంద్రంలో వెలసిన తుమ్మల మారెమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌ను శుక్రవారం పూలతో అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అనేకమంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

స్వచ్ఛ అభియాన్ చేపడుదాం

బీజేపీ నాయకులు

హిందూపురం అర్బన్, జనవరి 19: అయోధ్యలో ఈ నెల 22న బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని స్వచ్ఛ అభియాన్ కార్యక్రమం చేపడతామని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఆలయాల్లో, తీర్థ క్షేత్రాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. అదే విధంగా పల్లె, పట్నం, నగరం అన్ని ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకొందామన్నారు. ఈ సందర్భంగా త్యాగరాజనగర్‌లోని శివాలయంలో శుక్రవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ఆదర్శ కుమార్, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు చలపతి, మహిళా మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మీ గౌడ్, శంకర్, సునీల్, కిష్టప్పనాగరాజు, జగదీష్, శివన్న, శంకరప్ప, నందకుమార్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రొఫెషనల్స్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శివరాజ్



హిందూపురం, జనవరి 19 : టీడీపీ ప్రొఫెషనల్స్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రుద్రప్ప గారి శివరాజ్‌కుమార్‌ను నియమిస్తూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పెనుకొండ నియోజకవర్గం పరిగి మండలం గొల్లపల్లికి చెందిన శివరాజ్‌కుమార్ మూడేళ్లుగా టీడీపీ ప్రొఫెషనల్ వింగ్‌లో పనిచేస్తున్నాడు. పనితీరును గుర్తించి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా శివరాజ్‌కుమార్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కృషిచేస్తానని పేర్కొన్నారు. పార్టీ తనపై నమ్మకం ఉంచి ఇంత పెద్ద పనిని అప్పగించడం పట్ల టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, ప్రధాన కార్యదర్శి లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే బాలక్రిష్ణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పార్థసారధికి కృతజ్ఞతలు తెలిపారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

రొద్దం, జనవరి 19 : మండలకేంద్రంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని సివిల్ సప్లై అధికారులు ప్రారంభించారు. శుక్రవారం రొద్దంలోని వివిధ పంచాయతీలలో కందుల కొనుగోలు కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.8,300చొప్పున క్వింటాల్‌కు కొనుగోలు చేస్తున్నట్లు సివిల్ సప్లై అధికారి నవీన్ తెలిపారు. రైతుల వద్దకే వెళ్లి కందుల కొనుగోలుచేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం ద్వారా నాఫెడ్ అధికారులు కందులు కొనుగోలు చేస్తున్నారు. ఏరోజుకారోజు మార్కెట్ ధరలను అనుసరించి కందులు కొనుగోలుచేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

కులగణనకు నెట్‌వర్క్ సమస్య



బీదానిపల్లిలో నెట్‌వర్క్‌రాక ఇబ్బందులు పడుతున్న వీఆర్‌ఓ

రొద్దం, జనవరి 19: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేకు నెట్‌వర్క్ సమస్య వెంటాడుతోంది. రొద్దం మండల పరిధిలోని కంబాలపల్లి, బీదానిపల్లి, కోగిర, బొక్సంపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం కులగణనకు వెళ్లిన వీఆర్‌ఓ, పంచాయతీ కార్యదర్శులకు నెట్‌వర్క్ రాకపోవడంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అవస్థలు పడ్డారు. మారుమూల ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్య ఎదురవుతుండటంతో అధికారులు ఏం చేయాలో అర్థంకాక దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

అయోధ్య అక్షింతల పంపిణీ

అగళి, జనవరి 19 : మండలకేంద్రంలోని గాయత్రి కాలనీలో శుక్రవారం అయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. బీజేపీ ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు ఆనంద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు. త్వరలోనే అయోధ్యలో రామ మందిరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో శ్రీరామ భక్తులు పాల్గొన్నారు.



అక్షింతల పంపిణీలో బీజేపీ నాయకులు

విస్తరించని ఆర్టీసీ సేవలు

- ప్రారంభం నుంచి అవే సర్వీసుల కొనసాగింపు
- ప్రతిపాదనలకే పరిమితమైన అంతర్రాష్ట్ర సర్వీసులు
- పెరగని మడకశిర డిపో ఆదాయం



ఆర్టీసీ మడకశిర డిపో

మడకశిర, జనవరి 19: ఆర్టీసీ మడకశిర డిపో ప్రారంభమై దశాబ్దకాలం పైబడుతోంది. నేటికీ పూర్తిస్థాయిలో ఆర్టీసీ సేవలు విస్తరించ లేదు. అంతరాష్ట్ర సర్వీసుల కోసం స్థానిక అధికారులు ప్రతిపాదనలు పంపి సంవత్సరాలు గడుస్తున్నా మంజూరుకు నోచుకోలేదు. దీంతో ఈ ప్రాంతం ప్రజలే కాకుండా కర్ణాటక వాసులకు కూడా ఇబ్బందులు తప్పడం లేదు. కర్ణాటకలోని ధర్మస్థలం, బళ్లారి, చిక్కమంగళూరు వంటి ప్రాంతాలకు నేటికీ బస్సులు నడపడం లేదు. కరోనా మహమ్మారి నుంచి బయట పడి రెండు సంవత్సరాలు కావస్తున్న డిపోకు సంబంధించి ఆర్టీసీ ఆదాయం మెరుగుపడ లేదు. డిపో ప్రారంభంలో నుంచి 30 సర్వీసులను నడిపారు. ప్రస్తుతం అవే నడుస్తున్నాయి. అందులో హైటెక్ బస్సులు మూడు, ఎక్స్‌ప్రెస్‌లు 5, ఆర్డనరీలు 22 సర్వీసులు నడుపుతున్నారు. ఈ డిపో నుంచి ఆర్టీసీ సేవల విస్తరణ ఏ మాత్రం ముందుకు కదల లేదు. అయితే ప్రస్తుతమున్న సర్వీసుల్లో కొన్ని రూట్ల మళ్లింపుతో ఆర్టీసీ ఆదాయం తగ్గుతున్నట్లు సమాచారం. కొన్ని రూట్ల మళ్లింపు లేనపుడే డిపోకు ఆదాయం కొంత మెరుగ్గా ఉండేది. మడకశిర డిపో నుంచి 30 బస్సు సర్వీసులను వివిధ ప్రాంతాలకు నడుపుతున్నారు. ఇందులో విజయవాడ, నెల్లూరు, శ్రీశైలానికి మూడు హైటెక్ బస్సులు నడుస్తున్నాయి. వీటితో పాటు ఐదు ఎక్స్‌ప్రెస్‌లు, మిగిలిన 22 ఆర్డినరీ సర్వీసులు నడుపుతున్నారు. సాధారణంగా కిలో మీటరుకు రూ.40 రావాల్సి ఉండగా... రూట్లు మళ్లించాక ప్రస్తుతం రూ.35 నుంచి రూ.36 వస్తోంది. దీంతో కిలోమీటరుకు రూ.4 నుంచి రూ. 5 వరకు నష్టం వాటిల్లుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా కరోనా మహమ్మారి రకారణంగా తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ కు నడుస్తున్న బస్సును అప్పట్లో రద్దు చేశారు. నేటికీ పునరుద్ధరించలేదు. ప్రస్తుతం మడకశిర డిపో నుంచి అనంతపురం, కర్నూల్‌కు బస్సులను నడుపుతున్నారు. దీంతో హైదరాబాద్‌కు వెళ్లేవారు కర్నూల్ వరకు మడకశిర డిపోకు చెందిన బస్సుల్లో వెళ్లి అక్కడి నుంచి వేరే బస్సులు ఎక్కాల్సి వస్తోంది. దీంతో హైదరాబాదు వెళ్లే ప్రయాణికులు వ్యయప్రయాలు పడాల్సి వస్తోంది. హైదరాబాద్ కు వెళ్లే బస్సును పునరుద్ధరించి ఉంటే ఈ ప్రాంతంలోని వారికి ఎంతో ఉపయోగకరంగా ఉండేది. ఆర్టీసీకి ఆదాయం కూడా వచ్చేదని స్థానిక ప్రజలు అంటున్నారు. గతంలో మాదిరిగా మడకశిర నుంచి నేరు గా హైదరాబాద్‌కు బస్సు నడపాలని ప్రజలు కోరుతున్నారు. కర్ణాటకలో మాదిరిగా అంతర్రాష్ట్ర సర్వీసులు నడిపేందుకు అనుమతిస్తే డిపో ఆదాయం పెరగడంతో పాటు ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని పలువురు విన్నవిస్తున్నారు.

అంతర్రాష్ట్ర బస్సులు నడపాలి

మడకశిర డిపోనుంచి అంతరాష్ట్ర బస్సు సర్వీసులు నడిపితే ఈ ప్రాంతంలోని ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఆర్టీసీ ఉన్నతాధికారులు మడకశిర డిపో తనిఖీనిమిత్తం వచ్చినప్పుడు ఈ మేరకు విన్నవించారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతం కావడంతో కర్ణాటక ప్రాంతాలైన బెంగళూరు, ధర్మస్థలం, వర్థాడు , బళ్లారి, చెళ్లికెర ప్రాంతాలకు బస్సులు నడిపితే ఆర్టీసీ ఆదాయం పెరుగుతుందని తెలిపారు. అలాగే ఈ ప్రాంత ప్రజలకు, కర్ణాటక ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

డిపో ఆదాయం పెంచేందుకు చర్యలు

మడకశిర డిపో ఆదాయం పెరిగేందుకు చర్యలు చేపడుతాం. డిపో నుంచి 30 సర్వీసులు తిరుగుతున్నాయి. కిలో మీటరుకు రూ.40 రావాల్సి ఉండగా రూ.35 నుంచి రూ.36 వస్తోంది. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా బస్సులు నడుపుతాం.

- రామసుబ్బయ్య, ఆర్టీసీ డీఎం, మడకశిర

స్థల వివాదంతో మహిళ ఆత్మహత్యాయత్నం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శివమ్మ

గోరంట్ల, జనవరి 19: మండలంలోని తిప్పరాజుపల్లిలో మూడుసెంట్ల ఇంటి స్థలానికి సంబంధించి వివాదంతో ఈడిగ శివమ్మ అనే మహిళ శుక్రవారం క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీనిపై బాధితురాలు బంధువులు తెలిపిన మేరకు... తిప్పరాజుపల్లిలో శివమ్మ బంధువైన ఆదిలక్ష్మి పేరున ఉన్న స్థలాన్ని వైసీపీకి చెందిన అదే గ్రామవాసి వెంకటరమణ దౌర్జన్యంగా ఆక్రమించుకుని, ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. ఈ స్థలానికి 1994లో రెవెన్యూ అధికారులు శివమ్మకు పట్టా ఇచ్చారు. అందులో ఐదేళ్ల కిందటే శివమ్మ పునాది వేసింది. ఇటీవల వెంకటరమణ దానిని తొలగించి స్థలాన్ని ఆక్రమించాడు. దీనిపై తమకు న్యాయం జరగలేదని శివమ్మ విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను గోరంట్ల ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించారు. ఇదిలాఉండగా ప్రసుత్తం ఆ స్థలంలో నిర్మాణం పనులు చేపడుతున్న వెంకటరమణ మాట్లాడుతూ... 2018లో పట్టా వచ్చినందున ఆస్థలం తన అనుభవంలో ఉందన్నారు. ప్రస్తుతం రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండడంతో గ్రామంలోని తన రెండిళ్లలను అధికారులు తొలగించారని తెలిపారు. నష్టపరిహారంగా నెలరోజుల కిందట గోరంట్ల తహసీల్దార్ ఈస్థలాన్ని తనకోడలు లక్ష్మి పేరున అనుభవ హక్కుపత్రం ఇచ్చారన్నారు. తనకు వైసీపీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. స్థల వివాదంపై తహసీల్దార్ రంగనాయకులను వివరణ కోరగా సర్వేనెంబర్ 570లోని ఇంటి స్థలాన్ని 1994లో శివమ్మ బంధువు ఆదిలక్ష్మమ్మ పేరున పట్టా ఇచ్చారని, శివమ్మ స్పందనలో ఆర్జీ ఇవ్వగా పరిశీలించామన్నారు. పట్టాలో తహసీల్దార్ సీలు వేసి ఉందన్నారు. అయితే అప్పట్లో ఎమ్మార్వోల పాలన ఉన్నందున దానిని ఫేక్ పట్టాగా నిర్ధారించామన్నారు. పట్టా పొందిన ఆమె కువైట్‌లో ఉంటున్నట్లు పేర్కొంటున్న శివమ్మకు ఎలాంటి హక్కులేదన్నారు. వెంకటరమణకు సంబంధించిన రెండిళ్లు రోడ్డుకు పోవడంతో ఆ స్థలానికి ఆయన కోడలి పేరున పట్టా ఇచ్చినట్లు చెప్పారు. బంధువులకు సంబంధించిన స్థలం కోసం శివమ్మ ఘర్షణ పడుతోందని, ఆమెకు ఎలాంటి సంబంధం, అధికారం లేదని సీఐ సుబ్బరాయుడు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం

పెనుకొండ టౌన్, జనవరి 19 : పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై పులేకమ్మ గుడి సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో డిగ్రీ విద్యార్థి మధు(20) దుర్మరణం చెందాడు. పోలీసులు అందించిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. హిందూపురానికి చెందిన మధు స్నేహితులతో కలిసి ద్విచక్రవాహనంలో పెనుకొండకు వచ్చాడు. రాత్రి తిరుగు ప్రయాణంలో ముందుగా వెళుతున్న వాహనాన్ని ఢీకొని కిందపడటంతో తలకు బలమైన గాయాలయై అక్కడికక్కడే మృతిచెందాడు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పెనుకొండ పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

గోరంట్ల, జనవరి 19: మండలంలోని బీగొల్లపల్లికి చెందిన జయచంద్ర(44) మానసిక పరిస్థితి సరిగా లేదని, అనుమానస్పద స్థితిలో శుక్రవారం బావిలో శవమై తేలినట్లు గుర్తించామని సీఐ సుబ్బరాయుడు తెలిపారు. నెలరోజులుగా జయచంద్ర మానసిక పరిస్థితి సరిగాలేక అనంతపురం తదితర ప్రాంతాల్లో చికిత్స పొందారన్నారు. ఈనెల 16న ఫిట్స్ రావడంతో ఆరోగ్యం మరింత క్షీణించిదన్నారు. రెండురోజులుగా అతడు కనిపించక పోవడంతో బంధువులు గాలింపు చర్యలు చేపట్టారన్నారు. గ్రామంలోని ఓ బావిలో శవమై తేలగా స్థానికులు శుక్రవారం గుర్తించారన్నారు. ప్రమాదవశాత్తుపడ్డాడా... లేక ఆత్మహత్య చేసుకున్నాడా అనే విషయం తెలియాల్సి ఉందన్నారు. భార్య జయలక్ష్మి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ఆసుపత్రికి తరలించి, దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడికి కుమారుడు, కమార్తె ఉన్నట్లు చెప్పారు.

ప్రధానికి ఎమ్మార్పీఎస్ కృతజ్ఞతలు



ప్రధానికి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గోరంట్ల, జనవరి 19: ఎస్సీ వర్గీకరణ విషయంలో ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేయడంపట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి కృజ్ఞతలు తెలిపారు. గోరంట్ల పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్దకు వారు శుక్రవారం చేరుకున్నారు. ఎస్సీవర్గీకరణ పట్ల ప్రధాని చొరవ చూపడంతో ఆయనకు అభినందనలు తెలిపారు. మరింత వేగవంతం చేస్తూ వర్గీకరణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ నాయకులు మధుసూదన్, ఎస్సీ రమణ, మార్కెట్‌యార్డు ఓబులేసు, ఎస్ఐసీ శ్రీనివాసులు, పెయింటర్ నరసింహులు, నగేష్, బీ నరసింహులు, ఈశ్వర్, ఎమ్మార్పీఎస్ రమేష్‌బాబు, సైకిల్ నరసింహులు, గంగన్న, దండోరా నారాయణ, శ్రీనివాసులు, రామక్రిష్ణ, నాగేంద్ర తదితరులున్నారు.

యోగి వేమనకు ఘన నివాళి



కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న డీఆర్వో కొండయ్య

పుట్టపర్తి, జనవరి 19: ప్రజాకవి యోగివేమన జయంతి వేడుకలను స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేమన చిత్రపటానికి డీఆర్వో కొండయ్య, ఇతర అధికారులు పూలామాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డీఆర్వో మాట్లాడుతూ.. యోగి వేమన ప్రజల జీవన ప్రమాణాలను పద్యరూపంలో రచించి, ప్రజాకవిగా గుర్తింపు పొందారన్నారు. విశ్వదాభిరామ వినురవేమ అనే మాటను వినని తెలుగువారుండరని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, సాంఘిక సంక్షేమ శాఖాధికారి శివరంగప్రసాద్, గిరిజన సంక్షేమశాఖాధికారి మోహన్‌రామ్, పర్యాటక శాఖ మేనేజర్ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం: యోగివేమన జయంతి వేడుకలను పట్టణంలో రెడ్డి జేఏసీ నాయకులు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జేఏసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కామాటం శేషాద్రిరెడ్డి ,నాయకులు రంగారెడ్డి, మాధవరెడ్డి, కొళ్లమొరం చంద్రశేఖర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.



చిలమత్తూరులో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



లేపాక్షిలో వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

గాంధీజీ స్ఫూర్తితో ఉద్యమిస్తాం

39వ రోజు అంగన్‌వాడీల సత్యాగ్రహ దీక్ష

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

దేశ స్వాతంత్రం కోసం పోరాటం చేసిన మహాత్మాగాంధీ స్ఫూర్తితో ఉద్యమం కొనసాగిస్తామని అంగన్‌వాడీలు పేర్కొన్నారు. సమ్మెలో భాగంగా 39వ రోజు శుక్రవారం సత్యాగ్రహదీక్ష చేపట్టారు. హిందూపురంలోని సద్భావన్ సర్కిల్‌లోని పాత బీపీఎల్ షోరూం వద్ద ఏర్పాటు చేసిన శిబిరం వద్ద నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విజయవాడలో సీఎం జగన్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు పూనుకున్నారన్నారు. సీఎంకు మంచి బుద్ధి ప్రసాదించాలని అంబేడ్కర్‌కు విన్నవించామన్నారు. అలాగే పెనుకొండలో సీఐటీయూ నాయకులు అంగన్‌వాడీలు అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో రాష్ట్ర బంద్ నిర్వహిస్తామని హెచ్చరించారు. లేపాక్షిలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో, మడకశిరలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంబేడ్కర్ చిత్రపటాన్ని ఉంచి పూలమాలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ చిత్రపటానికి సమస్యలు విన్నవించారు. చిలమత్తూరు ముందుగా నిరసన ర్యాలీ చేశారు. అంబేడ్కర్ విగ్రహం ఎదుట బైఠాయించి తమ సమస్యలను మొరపెట్టుకున్నారు. గుడిబండలోని సీడీపీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు నిరసన కొనసాగించారు. రొళ్ల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడే ఆందోళన నిర్వహించారు.



రొళ్లలో...



మడకశిరలో...

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హిందూపురం అర్బన్, జనవరి 19: పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈఈ నారాయణస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని సూగూరు 11 కేవీ విద్యుత్ లైన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. రహమత్‌పురం, సీపీఐ కాలనీ, శిల్క్ కాలనీ, ఆర్టీఓ కార్యాలయం ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెనుకొండ: మండలంలో శనివారం విద్యుత్ లైన్ మరమ్మతులు కారణంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ పరమేశ్వర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

కసిరెడ్డిపల్లిలో చౌడేశ్వరీ దేవి గ్రామోత్సవం



చౌడేశ్వరీదేవిని ఊరేగిస్తున్న గ్రామస్థులు

గోరంట్ల, జనవరి 19: మండల పరిధిలోని కసిరెడ్డిపల్లిలో గురువారం రాత్రి చౌడేశ్వదేవి ఊరేగింపు వైభవంగా సాదిగింది. ఇందులో తొగట వీర క్షత్రీయుల జ్యోతుల నృత్యప్రదర్శన కన్నులపండుగ చేసింది. గ్రామస్థుడు చౌడి రెడ్డి అమ్మవారికి శాంతి పూజలు చేపడతామని మొక్కుకున్నారు. దీంతో గ్రామ పెద్దలంతా కలిసి రెండున్నరయేళ్లుగా చౌడేశ్వరీ దేవిని ఊరేగించలేదని గ్రామస్థులు తెలిపారు. వర్షాలు సరిగాకురిసి, గ్రామం పాడిపంటలతో కలకలాడాలంటే నిలిచిపోయిన అమ్మవారి ఊరేగింపు నిర్వహించాలని తలపెట్టారు. సోమందేపల్లి, ముద్దిరెడ్డిపల్లి ప్రాంతాల నుంచి తొగటవీర క్షత్రియులను పిలిపించి వారిచే జ్యోతుల నృత్య ప్రదర్శన కోలాహలంగా జరిపారు. గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తరువాత అమ్మవారికి బలిదానం, శాంతి పూజలను నిర్వహించారు.

దళిత ద్రోహి జగన్: టీడీపీ



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళిత నాయకులు

మడకశిర రూరల్, జనవరి 19: దళితులను అన్ని విధాలా మోసం చేసిన దళిత ద్రోహి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్ విమర్శించారు. నియోజకవర్గంలోని టీడీపీ దళిత నాయకులందరూ శుక్రవారం పట్టణంలో అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుని నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా మంజునాథ్ మాట్లాడుతూ... సీఎం జగన్ ఇప్పటివరకు దళితులను మోసం చేస్తూ, తన తీరుతో ఎంతో మందిని పొట్టనపెట్టుకున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం ఎన్నికల సమయంలో అంబేడ్కర్ విగ్రహం పెడితే ఓట్లు వస్తాయి అనుకోవడం జగన్మోహన్‌రెడ్డి భ్రమ అన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో వారానికి నలుగురు దళిత మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. దళితులను చంపి డోర్ డెలివరీ చేయడం, దళిత మహిళలను ట్రాక్టర్‌తో తొక్కించడం, ఎస్సీ కార్పోరేషన్ నిధులను ఇతర శాఖలకు మళ్లించడం, ఇసుక అక్రమమాలను ప్రశ్నించిన దళితుడికి పోలీస్‌స్టేషన్‌లోనే శిరోముండనం చేయడం వంటి ఘటనలకు జగన్ రెడ్డే కారకుడని విమర్శించారు. దళితుల బాగోగులు చూసుకోవాలన్నా, దళితులు బాగా అభివృద్ధి చెందలన్నా టీడీపీ అధినేత ఒక్క చంద్రబాబునాయుడితోనే సాధ్యమన్నారు. దళితులంతా ఒక్కటై చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు మనోహర్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జయకుమార్, ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి రంగేగౌడ్, బీసీ జిల్లా కార్యదర్శి నరసింహప్ప, దళిత నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయాధికారి లేక ఇబ్బందులు



అగళిలోని గ్రంథాలయం

అగళి, జనవరి 19 : మండల కేంద్రంలో గ్రంథాలయాధికారి లేక పోవడంతో గ్రంథాలయానికి వచ్చే పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కావున వెంటనే గ్రంథాలయాధికారిని నియమించాలని పాఠకులు కోరుతున్నారు. కొన్నేళ్లుగా గ్రంథాలయాధికారి లేడన్నారు. దీంతో గ్రంథాలయం నుంచి ఏ చిన్న పుస్తకం తీసుకోవాలన్నా ఇచ్చేవారే లేరన్నారు. అదేవిధంగా ఈ గ్రంథాలయానికి కేవలం మూడు దినపత్రికలు మాత్రమే వస్తున్నాయని వాపోయారు. గ్రంథాలయాధికారి ఉంటే ప్రతి పుస్తకం తీసుకుని చదివే వాళ్లమన్నారు. కొన్ని సంవత్సరాలుగా గ్రంథాలయాధికారి లేకపోవడంతో పుస్తకాలు ఇచ్చే వారేలేరన్నారు. అగళి మండలం కర్ణాటక సరిహద్దులో ఉన్నందువల్ల ఈ మండలాన్ని పట్టించుకునే అధికారులు కానీ ప్రజాప్రతినిధులుగాని లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి స్థానిక గ్రంథాలయానికి అధికారిని నియమించాలని మండల ప్రజలు, పాఠకులు కోరుతున్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన ర్యాలీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ గిరీష్

పావగడ, జనవరి 19: మత్తు పదార్థాలను వీడి కుటుంబాలు సంతోషంగా జీవించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీఐ గిరీష్ పేర్కొన్నారు. పావగడ పట్టణంలో శుక్రవారం విద్యార్థులు గులాబీ ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని ఐబీ నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం చేరుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఐ గిరీష్ మాట్లాడుతూ... ముఖ్యంగా కుటుంబ యజమానులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉండాలన్నారు. ఇప్పటికే అలవాటు పడ్డవారు క్రమేణా పూర్తిగా మానుకొని ప్రశాంతంగా జీవించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మత్తు పదార్థాలు వీడాలని నినాదాలు చేస్తూ గులాబీ పూలను అందించి హితవు చెప్పారు.